

జంపని రామమోహన రావు

# వెన్నెల కురిసిన రాత్రి

వెన్నెల జల్లు కురుస్తున్నది.

పున్నమి చంద్రుడు సొగసులు ఒలకబోస్తున్నాడు. మందమందంగా వేస్తున్నది గాలి. అందాలు చిందిస్తున్నది ప్రకృతి.

ఈ చెట్లూ, పిట్టలూ, పువ్వులూ, పురుగులూ, రాళ్లూ, నీళ్లూ — ఇవి మానవులకంటే అదృష్టవంతమైనవి కాబోలును — ఎటువంటి చీకూ, చింతా, కలతా, కల్లోలమూ లేకుండా హాయిగా, సుఖంగా, వెన్నెల సోయగాలను తనివి తీరా అనుభవిస్తున్నాయి

సుదూరంగా ఉన్న జాబిల్లిని అందుకోవాలనేమో - ఎగిరెగిరి పడుతూ విఫల యత్నాలు చేస్తున్నాయి సముద్రపు కెరటాలు. వెన్నెల కాంతిలో అవి మిలమిల మెరుస్తున్నాయి.

సముద్రపు ఒడ్డున నిలబడి తృప్తిగా నవ్వుకున్నది ఆమె. తన కష్టాలు కడతేరబోతున్నాయి?

సువిశాలమైన ఈ ప్రపంచంలో తనకు ఓ చోటంటూ లేకపోలేదు. ఆ ఉన్న నిప్పుల చోటును తాను భరించలేకపోయింది. సహించలేకపోయింది.

ఇప్పుడు—

ఎదురుగా విశాలమైన సాగరం. రా రమ్మని నిష్కల్మషంగా నవ్వుతూ, స్నేహపూర్వకంగా ఆహ్వానిస్తున్నవి కెరటాలు. ఈ ఆశ్రయంలో సుఖం లభించినా, లేకున్నా, దుఃఖపు కల్లోలా లుండవు. అది చాలు తనకు!

ఆమె ముందుకు నడిచింది.

నీళ్ళలోకి—

సముద్రంలోకి—

"ఆగు! ముందుకు వెళ్ళకు!" నిశ్శబ్దాన్ని చీలుస్తూ బిగ్గరగా వినపడింది ఓ గావుకేక.

అప్రయత్నంగా ఆగి వెనుకకు తిరిగి చూచిందామె.

ఎవరో వ్యక్తి "ఆగు! ఆగు" అని అరుస్తూ పరుగెత్తుకొస్తున్నాడు. తనను పట్టుకొనటానికే!

ఆమె ఆగలేదు. ఆగాలని రాతే దిక్కడకు. ముందుకు పరుగెత్తింది. ఆ మనిషి తనను పట్టుకోకముందే తాను నీళ్ళలో కలిసిపోవాలి! నీళ్ళలో లోతు లోతుకు వెళుతోంది. ఇంకా కొద్ది క్షణాల్లో తాను మునిగిపోతుంది. మునిగిపోవాలి.

"ఆగు! ముందుకు వెళ్ళకు!"— అరుస్తూ జబ్బపట్టుకుని వెనక్కు లాగాడా మనిషి.

"వదులు—నన్నొదులు." పెనుగులాడిందామె.

అతడు బలవంతుడు. ఆమెను రెండు చేతుల్లో ఇరికించుకుని, గట్టుకు లాక్కొచ్చాడు.

గట్టుకు వచ్చాక, ఆమె అతణ్ణి విదిలించుకుని దూరంగా జరిగి, రోషంగా అన్నది. "మీరు నాకు మేలు చేశానని కులుక్కుంటున్నారేమో! అలాంటిది పీసమంతకూడా చేయలేదు. పైగా ఎంతో అన్యాయం చేశారు."

"ఒప్పుకుంటాను. అలాచెయ్యకుండా ఉండలేకపోయాను. అందుకు క్షమించండి." అన్నాడతడు.

"అసలు నా దారికి ఎందుకు అడ్డం వచ్చారు. మీ రెవరు? నే నెవర్ని? ముక్కూ మొకం తెలియని వాళ్ళ విషయాల్లో కలగజేసుకునే అధికారం మీకేముంది?"

"ఇందులో అధికారం ప్రశ్నేలేదు. మీరూ మనిషి నేనూ మనిషిని! సూర్యచంద్రుల దగ్గరనుండి ప్రకృతిలో ప్రతి వస్తువూ తన డ్యూటీ తాను చేస్తూనే ఉంటుంది. మనిషిగా నా డ్యూటీ నేను చేయాలిగదా."

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఇసుకలో కూర్చుంది నిశ్శబ్దంగా. సముద్రపుటలలు తళతళ మెరుస్తున్నాయి వెన్నెల విరగ కాస్తోంది.

"కష్టాలు అందరికీ వస్తాయి. కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగటమే మనుషులు చేయవలసిన పని. మీరెందుకు ఇంతగా అధైర్యపడిపోయారు?"... లాలనగా అడిగాడతను.

ఆమె వెంటనే సమాధానం చెప్పలేదు. గతం తలంపుకు వస్తోంది. దుఃఖం కట్టలు త్రెంచుకుంటోంది. కన్నులు నీళ్ళతో నిండాయి

"మీకెందుకు నా విషయం? ఆర్పే వారా తీర్చేవారా?"

"మనుషుల కష్టాలను ఒక్కొక్కప్పుడు భగవంతుడుకూడా ఆర్పలేడు తీర్చలేడు. ఇహ మామూలు మనుషులం మనం ఏపాటి?... మీకు ఇష్టం లేకపోతే చెప్పవద్దు."

ఆమెకు ఏడుపు ఆగలేదు.


"కొన్ని కొన్ని జీవితాలు బ్రతికి ఉండేకంటే చావటం నయం. ఈ జీవితం నేను భరించలేను." చెప్తూ ఏడవసాగిందామె. ఏడుస్తూ మధ్య మధ్యలో చెప్పింది—'తన' అనే వారందరూ వసునగా పోవటం—బ్రతుకు తెరువు లేకపోవటం—వయసొచ్చిన ఆడది కాలు కదిపితే కాటు వేసేందుకు సిద్ధంగా ఉన్న లోకం—బ్రతుకుతెరువుకోసం చేసిన ప్రయత్నాలు—మగవాళ్ళ కుట్ర... ఘోరంగా, దౌర్జన్యంగా, రాక్షసంగా చేసిన బలాత్కారం...తనకొక బ్రతుకు తెరువు చూపుతానని చెప్పినవాడు... నమ్మి వాడితో తను వెళ్ళటం...ఆ ఇంట్లో తనను అమ్మాడని ఆ తర్వాత తెలియటం...ఆ ఇల్లు; అది ఇల్లు కాదు నరకం!... ఆ నరకంలో కొద్దిరోజులు వద్దు వద్దు వద్దు ఈ జీవితం!... ఈ జీవితంకంటే చావే నయం!..."

కన్నీరు మున్నీరుగా, జాలిగొలిపేలా ఏడుస్తోందామె. అది ఏడుపుకాదు. వ్యథిత హృదయం అనుభవించే కత్తి కోత!...దుర్భర వేదన!!

"ఊరుకో. ఏడవకు." చనవుగా అన్నాడు అతడు.

ఆమె ఒక పట్టాన ఏడుపు మానలేదు. అతడు ఎంతగా ఓదార్చినా ఫలితం లేకపోయింది కొద్దిసేపు అలా ఏడ్చి గుండెల్లో బాధ తగ్గాక తనే ఊరడిల్లింది. కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"నీకు అభ్యంతరం లేకపోతే నాతో రా. నీకేదైనా మంచిదారి చూపిస్తాను. ఏమి చూపిస్తానో ఇప్పుడు చెప్పలేను. కానీ, ఏదో ఒకదారి చూపిస్తాను. నన్ను నమ్మగలిగితే నాతో రా. నాతో రాకపోయినా నువ్వు ఇలాంటి పనిమాత్రం ఎన్నడూ చేయాలనుకోకు. జీవితం ఎంతో విలువైనది చచ్చి సాధించేదేమిటి? రేపుమీద ఆశతో బ్రతకాలి."




ఆమె కొంచెం ఆగి అన్నది. "మీ మంచితనం గ్రహించాను. మీతో రావ టానికి నాకేమీ అభ్యంతరంలేదు. ఇంతకూ మీరెవరు? చెప్పనే లేదు."

"నేనొక నిర్భాగ్యుణ్ణి. నిర్భాగ్యుల కథలకు ఈ సమాజంలో లోటు ఏముంది? వందలాది, వేలాది నిర్భాగ్యులలో నాదీ ఒక కథ. నాకు భార్యా, బిడ్డలూ' సంసారమూ అన్నీ ఉన్నాయి. వాళ్ళు నాకంటే నిర్భాగ్యులు. అదంతా ఒక కథ...కన్నీటి కథ?"

"ఇంత అర్ధరాత్రి సమయంలో అస లిక్కడ కెందుకు వచ్చారు?"

"జీవితంలో ఒక్కొక్క సంఘటన ఒక్కొక్క మలుపుకు దారితీస్తుంది. నేను సహజంగా భయస్థుణ్ణి. నా పిరికి తనమే నన్నిక్కడకు తెచ్చింది. కానీ, ఇప్పుడు నాలో ఆ పిరికితనం లేదు. అందుకు నీకు కృతజ్ఞుణ్ణి. లే. ఇంక వెళదాం."

ఇద్దరూ సముద్రానికి క్రమక్రమంగా దూరం కాసాగారు.

సముద్రపు కెరటాలు తళ తళ మెరుస్తున్నాయి. వెన్నెల విరగ కాస్తోంది.